అటకెక్కిన ఈ-పంచాయతీ పాలన

- గ్రామపంచాయతీల్లో మూలనపడిన కంప్యూటర్లు
- అందని పౌరసేవలు
- ధ్రువపత్రాల కోసం మండల కేంద్రానికి పయనం
- సమస్యను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



చీదెళ్ల గ్రామపంచాయతీ కార్యాలయం

స్థానికంగా అప్‌లోడ్ చేయాలి

పౌరసేవల ధ్రువపత్రాలను స్థానికంగా అప్‌లోడ్ చేసుకోవాలి. కొన్నిచోట్ల కంప్యూటర్లు నిరుపయోగంగా ఉండటం వాస్తవమే. త్వరలోనే ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ప్రజలకు అన్ని రకాల ధ్రువపత్రాలు పంచాయతీలోనే జారీ చేస్తాం.

– సంజీవయ్య, ఎంపీఓ

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పారదర్శకంగా సేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఈ పంచాయతీ పాలన చేపట్టింది. ఈ పాలనతో పంచాయతీల్లోనే గ్రామస్తులకు కావాల్సిన ధ్రువపత్రాల జారీకి శ్రీకారం చుట్టింది. కాని ఈ పాలన గ్రామాల్లో అటకెక్కడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎంపికైన గ్రామాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఆపరేటర్లను నియమించిన అధికార యంత్రాంగం సకాలంలో కార్యాలయాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో చాలా చోట్ల పంచాయతీల్లో కంప్యూటర్లు అటకెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల ఆన్‌లైన్ సౌకర్యం, ప్రింటర్లు, స్కానర్లు లేక పౌర సేవలకు విఘాతం కలుగుతోంది. వివిధ ధ్రువపత్రాలు కావాలంటే ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పంచాయతీ కింద ఎంపికైన మెజార్టీ గ్రామపంచాయతీల్లో ఇదే దుస్థితి నెలకొంది. క్లస్టర్ పంచాయతీలకు ఆన్‌లైన్ సేవలు కల్పించే పనులను గతంలో బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థకు అప్పగించారు. కొన్నిచోట్ల కేబుల్ ద్వారా కనెక్షన్ ఇచ్చి అర్థాంతరంగా నిలిపివేయడంతో మరో సంస్థకు బాధ్యతలు అప్పగించారు. కొన్నింటికీ కనెక్షన్లు ఇవ్వగా మధ్యలో మిషన్ భగీరథ కోసం రోడ్లు తవ్వడంతో చాలా చోట్ల కేబుళ్లు తెగిపోయాయి. ప్రస్తుతం టీ–ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించే పనులు కొనసాగుతున్నా కొన్ని అవాంతరాలతో గ్రామ పంచాయతీలకు నెట్ సౌకర్యం లేదు. దీంతో ప్రజలు ధ్రువపత్రాల జారీ కోసం పంచాయతీలో మ్యాన్‌వల్‌గా దరఖాస్తులు తీసుకొని మీ సేవా, మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరగాల్సివస్తుంది.

ధ్రువపత్రాల నమోదు కోసం..

పంచాయతీల్లో జనన, మరణ ధ్రువపత్రాలు, వసూలు చేసిన ఆస్తిపన్నుల రసీదులు, అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వ్యయం వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉండగా ఆన్‌లైన్ సదుపాయం లేక కార్యదర్శులే ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లి అప్‌లోడ్ చేస్తున్నారు.

17పంచాయతీలకు కంప్యూటర్ల కేటాయింపు..

మండలంలో 29గ్రామపంచాయతీలు ఉండగా అందులో 17పంచాయతీలకు ప్రభుత్వం కంప్యూటర్లు కేటాయించింది. ఈ పంచాయతీ కింద కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానింగ్, ఇంటర్‌నెట్ సేవలు కల్పించే పనిలో అధికార యంత్రాంగం ప్రయత్నిస్తున్నా ప్రజలకు పౌర సేవలు అందడం లేదు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుంటే గతంలో వేసిన కేబుళ్లు తెగిపోవడం, తదితర కారణాలతో పౌర సేవలకు ఆటంకం కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో ఈ పాలన ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మంచిర్యాల డీసీపీకి పలువురి అభినందనలు



డీసీపీ భాస్కర్

అర్వపల్లి: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల డీసీపీగా పనిచేస్తున్న ఎగ్గడి భాస్కర్‌కు ప్రభుత్వం ఐపీఎస్(నాన్ కేడర్) హోదా కల్పించింది. ఆయన స్వస్థలం జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి. ఈయన గ్రూప్–1 నుంచి పోలీసుశాఖలో చేరారు. భాస్కర్ మొదట ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని కోడూరు తదితర పాఠశాలల్లో టీచర్‌గా పనిచేశారు. భాస్కర్ భార్య మాలిని ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఐపీఎస్ హోదా దక్కిన భాస్కర్‌కు పలువురు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

తిరుమలగిరి వ్యవసాయ అధికారిగా నాగేశ్వరరావు



తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల నూతన వ్యవసాయ అధికారిగా సీహెచ్.నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నల్లగొండ జిల్లాలోని డిండి మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తూ బదిలీపై మండలానికి వచ్చారు. తిరుమలగిరి మండల వ్యవసాయ అధికారిగా పనిచేసిన వెంకటేశ్వర్లు చివ్వెంల మండలానికి బదిలీపై వెళ్లారు.

మద్దిరాల ఎస్‌ఐగా వీరన్న



మద్దిరాల : మండల నూతన ఎస్‌ఐగా మెతుకు వీరన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం మండల ఎస్‌ఐగా పనిచేసిన మధునాయుడు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ నుంచి వీరన్న మండలానికి బదిలీపై వచ్చారు.


నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

మద్దిరాల : మండల కేంద్రంలో పీఆర్టీయూ నూతన మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఇరుగు సోమయ్య, ఉప్పు నాగయ్య సమక్షంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింత రామలింగారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా భూక్య శంకర్, ప్రధాన కార్యదర్శిగా కమాళ్ల మురళీధర్, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ జహీర్, కార్యదర్శిగా కడారి సతీష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా తంగెళ్ల రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేశ్వర వెంకటయ్య, మేడపల్లి శ్రీనివాస్, కందుకూరి శివశంకర్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కృపాకర్

సూర్యాపేట : మున్సిపాలిటీలోని 45వవార్డు విద్యానగర్‌కు చెందిన పిల్లలమర్రి రేణుక – శ్రీనివాస్‌ల కుమారుడు అవినాష్ హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతడు చదువుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో స్పందించిన చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ విద్యార్థికి బుధవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

విద్యుత్ శాఖ నూతన ఎస్‌ఈకి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు

సూర్యాపేట : విద్యుత్ శాఖ జిల్లా ఎస్‌ఈగా బాధ్యతలు చేపట్టిన ఫ్రాంక్లిన్‌ను సూర్యాపేట డివిజన్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అనంతుల వేణుగోపాల్‌గౌడ్, దోసకాయ శ్రీనివాస్, రవికుమార్, నాగేందర్, రమేష్, రఘు, రవి, నరేందర్, ఉపేందర్, వెంకటయ్య ఉన్నారు.

సీలింగ్ ఫ్యాన్ బహూకరణ

నాగారం : మండలంలోని వర్ధమానుకోట అంగన్‌వాడీ కేంద్రం–2కు బుధవారం స్థానిక అంబేద్కర్ యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఈదుల కిరణ్‌కుమార్, యూత్ అధ్యక్షుడు దర్శనం వినయ్, ఎల్లాస్వామి, కోక వెంకటేష్, తరుణ్, పంది కిరణ్, అంబేద్కర్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ నాయకులు

భానుపురి (సూర్యాపేట) /చివ్వెంల : మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, అత్యాచారానికి పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలోని లెనిన్‌నగర్‌లో కల్‌కతాలో అత్యాచారానికి గురైన జూనియర్ డాక్టర్ మృతికి నిరసనగా కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, మంగళవారం ఒక్క రోజే ముగ్గురు మహిళలపై అత్యాచారాలు కావడం దుర్మార్గమన్నారు. మోదీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎర్ర అఖిల్, శారద, సంతోష్, అంజలి, కల్పన, గౌరమ్మ, రాధ, శ్రీదేవి, జయమ్మ, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీలు అందజేత



విద్యార్థులకు డైరీలు అందజేసిన ఎంఈఓ రవి

పెన్‌పహాడ్ : విద్యార్థులు డైరీ రాసే అలవాటుతో క్రమక్రమంగా పొరపాట్లు తగ్గించుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని ఎంఈఓ నకిరేకంటి రవి, సెక్టోరియల్ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలామ్ డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డైరీలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డైరీ రాసే అలవాటు చక్కని భావవ్యక్తీకరణ సామర్థ్యం తద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దారితీసుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, ఎం.పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

బీసీ న్యాయవాదుల సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న న్యాయవాదులు

చివ్వెంల : హైదరాబాద్‌లో ఈనెల 25న జరిగే బీసీ న్యాయవాదుల సదస్సును విజయవంతం చేయాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషన్ అసోసియేషన్ (ఐఎల్‌పీఓ) రాష్ట్ర నాయకుడు సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో బీసీ సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ హక్కుల సాధన ఉద్యమంలో బీసీ న్యాయవాదులను ఏకంచేయడానికి నిర్వహించే ఈ సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, సీనియర్ న్యాయవాదులు తల్లమళ్ల హస్సేన్, మాదవ కృష్ణ, పూస మల్లేష్, భిక్షమయ్య, శంకరయ్య, సత్యనారయణ పిళ్లే, కాకి రాంరెడ్డి, లింగయ్య, రంజిత్‌కుమార్, అనిల్, సుభాషిణి, చందన, అశోక్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కులాంతర వివాహాలతో కులరహిత సమాజం



కులాంతర వివాహాన్ని జరిపిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : కులాంతర వివాహాలతో కులరహిత సమాజాన్ని స్థాపించగలమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మోతె మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన కొరిపల్లి గౌతమ్, చివ్వెంల మండలం చందుపట్ల గ్రామానికి చెందిన కొడిదల నాగలక్ష్మి కులాంతర వివాహాన్ని కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో నిచ్చెన మెట్ల వ్యవస్థలా కొనసాగుతున్న కులాన్ని నిర్మూలించాలంటే కులాంతర వివాహాలతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు జె.నరసింహారావు, తల్లిదండ్రులు కొడిదల శ్రీను, పిచ్చమ్మ, కొరిపెల్లి నరసయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దండు మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు



విద్యుత్‌దీపాలతో అలంకరించిన దండుమైసమ్మ ఆలయం

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవానికి ముస్తాబైంది. గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న బోనాల మహోత్సవానికి దేవాలయాన్ని అధికారులు అందంగా ముస్తాబు చేశారు. ఆలయాన్ని విస్తరించిన తదనంతరం జరగనున్న మొదటి బ్రహ్మోత్సవాలు కావడంతో అధికారులు భారీ ఏర్పాటు చేశారు. ఈనెల 22న (గురువారం) గోపూజ, వేదపఠనం, ఆలయ ప్రదక్షిణ, గణపతి పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించనున్నారు. 23న(శుక్రవారం) వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తుబలి, 24న(శనివారం) మహా పూర్ణాహుతి, మహా కుంభ కలిశాభిషేకం, బలిహరణం, మాలాధారణం, మాల వితరణ, మహా దర్శనం, వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, పండిత సన్మానం, స్వస్తి తదితర కార్యక్రమాలు నిర్వహించి 25న అమ్మవారికి బోనాలు సమర్పించి అన్నదాన కార్యక్రమం చేట్టనున్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

చివ్వెంల : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మొక్కలు నాటుట, ఉపాధిహామీ పనులు గుర్తించుట, రెవెన్యూ సమస్యలు గుర్తించాలని సూచించారు. ప్రజా సమస్యల పట్ల గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతయుతంగా మెలగాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఎంపీఓ దయాకర్, ఏపీఓ నాగయ్య, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సీట్ల సంఖ్య పెంచాలి

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్రంలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ హాస్టళ్లలో సీట్ల సంఖ్య పెంచాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతోమంది పేద విద్యార్థులు ప్రైవేటు హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్నారని, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, సంక్షేమ హాస్టళ్ల సంఖ్య పెంచి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు చెల్లించాలని, అన్ని హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘం నేతలు వెంకట్, కత్తి సైదులు, నిఖిల్, చక్రవర్తి, జయంత్,, వై.శివ, ఆర్.నరేందర్, బి.సంతోష్, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తాటిపాముల గ్రామంలో ప్రజా నాట్యమండలి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కారుపోతుల అంజన్న 29వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్న స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో అభ్యుదయ యువజన సమైక్య యూత్ అధ్యక్షుడు మహేందర్, కాకర్ల రమేష్, కిషన్, సురేష్, దయా , అవిలయ్య ఉన్నారు.

రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణ

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం, రామన్నగూడెం రైతు వేదికలలో బుధవారం ఏఈఓలు రూ.2లక్షల రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు రుణమాఫీ రాని రైతులు 102మంది దరఖాస్తులు చేశారని మండల వ్యవసాయ అధికారి పెండోట గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు శోభారాణి, సత్యం, సిబ్బంది వర్ష, రైతులు పాల్గొన్నారు.

మద్దిరాల : సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులు తమ క్లస్టర్ రైతువేదికలో దరఖాస్తు అందజేయాలని మండల వ్యవసాయ అధికారి కంభం మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి రుణమాఫీకాని రైతులు సంబంధిత రైతువేదికలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు బాధాకరం



తిరుమలగిరిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు నాయకులు



సూర్యాపేట : బంద్‌లో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

సూర్యాపేట : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు జడ్జీలు ఇచ్చిన తీర్పు బాధాకరమని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ తలమల్ల హస్సేన్ అన్నారు. బుధవారం చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ ఏడిండ్ల అశోక్, కోకన్వీనర్లు అశోధ రవి, దాసరి దేవయ్య, కట్ల మురళి, కట్ట సైదులు, బొల్లెద్దు వినయ్, అఖిల్, జానకిరాములు, జ్యోతి, పిట్టల భాగ్యమ్మ, కరుణాకర్, నాగయ్య పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చట్ట విరుద్ధం

ఆత్మకూర్(ఎస్) : ఎస్సీ వర్గీకరణపై అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పురావడం చట్టవిరుద్ధమని, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు చేపడితే మాలమహానాడు చూస్తూ ఊరుకోదని మాల మహానాడు జిల్లా నాయకుడు గరిగంటి ప్రకాష్ అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బందులో భాగంగా బుధవారం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు సంఘం నాయకులు గంపల కరుణాకర్, గంపల నారాయణ, శంకర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ బంద్ పట్టణంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా మాల మహానాడు మున్సిపాలిటీ అధ్యక్షుడు గంట లక్ష్మణ్ మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు విద్యార్థుల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సందీప్, సంపత్, ఉదయ్, మాణిక్యరావు, ప్రభుదాస్, యాకూబ్, సోమన్న, సాల్మన్, సుధాకర్, సందీప్, అరుణ్, నవీన్, జీవరత్నం పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకిస్తూ విద్యా సంస్థల బంద్

నాగారం : ఏబీసీడీ వర్గీకరణ క్రిమిలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో విద్యా సంస్థల బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ నాయకుడు ఎర్ర రాంబాబు మాట్లాడారు. అనంతరం వివిధ పాఠశాలల్లోని హెచ్‌ఎంలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు వేల్పుల వెంకన్న, ప్రసాద్, శేఖర్, సాయి, కిరణ్, సమీర్, నజీర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గట్టికల్‌ను సందర్శించిన లయోలా కాలేజీ విద్యార్థులు



గ్రామ రైతులతో లయోలా కాలేజీ విద్యార్థులు

ఆత్మకూర్(ఎస్): గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ డిగ్రీ కోర్సు విద్యార్థులు బుధవారం మండలంలోని గట్టికల్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. గ్రామస్తులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కార మార్గాలను సూచించినట్లు కేవీకే ప్రోగ్రాం అసిస్టెంట్ ఆకుల నరేష్ తెలిపారు. రైతులు భూసార పరీక్షలు చేయించకుండా ఒకే పంట పండిస్తుండడంతో భూసారం తగ్గి, చీడపీడలు పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించి అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శివ, రైతులు లింగయ్య, నాగరాజు, రమేష్, సైదులు, రాజు, సరస్వతి, వెంకన్న, వ్యవసాయ విద్యార్థులు కే. సురేష్ రెడ్డి, జహీర్, భరత్‌రెడ్డి, దత్తసాయి, జాన్ పాల్గొన్నారు.

పాస్టర్ ఫెలోషిప్ కమిటీ ఎన్నిక

ఆత్మకూర్(ఎస్) : మండలంలోని మక్తకొత్తగూడెం గ్రామంలో బుధవారం పాస్టర్ ఫెలోషిప్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ జలగం డేవిడ్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మీసాల గోవర్ధన్ నూతన మండల కమిటీని ప్రకటించారు. నూతన గౌరవ అధ్యక్షుడిగా ఫాదర్ అలెగ్జాండర్, ధరావత్ లాజర్‌నాయక్, గౌరవ సలహాదారులుగా మచ్చ ఏసుపాదం, జలగం పీటర్‌బాబు, కోడూరు ఎజ్రా, బొడ్డు మత్తయి, అధ్యక్షుడిగా కోట సామ్సన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోట సామెల్, ఉపాధ్యక్షుడిగా భరణి బాలస్వామి, ప్రధాన కార్యదర్శిగా కోట యోహాను, సహాయ కార్యదర్శిగా అంకం వెంకన్న, కోశాధికారిగా మచ్చ రాబర్ట్, మీడియా కన్వీనర్‌గా కత్తుల జీవన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గంపల దానియేలు, వై.డేవిడ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెవరెండ్ కాపర్తి సైమన్, సలహాదారులు రెవరెండ్ ధరావత్ లాజర్‌నాయక్, కోశాధికారి రెవరెండ్ పూజర్ల సామేల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

సూర్యాపేటటౌన్ : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి సీఐ రాజశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని, సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 622దరఖాస్తులు వచ్చాయని, అందులో 362 మొబైల్‌లు ట్రేస్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికి 135ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందజేశామన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

తుంగతుర్తి : రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ నేడు (గురువారం) మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే నియోజకవర్గ స్థాయి ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

అర్వపల్లి : ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం తిరుమలగిరిలో చేపట్టే ధర్నాకు రైతులు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో వచ్చే నెల 3న నిర్వహించే మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన 14, 17సంవత్సరాల బాల, బాలికల మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను విజయవంతం చేయాలని ఎంఈఓ బాలునాయక్ కోరారు. ఈ సందర్భంగా మండల స్థాయి స్కూల్‌గేమ్స్ నిర్వహణపై బుధవారం స్థానిక ఎమ్మార్సీలో పీఈటీలతో ఆయన సన్నాహక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఓపెన్ స్కూల్ సొసైటీ కోఆర్డినేటర్ జలగం జగదీష్ బుధవారం ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 30వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, పాఠశాల హెచ్‌ఎం దామెర శ్రీనివాస్, ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ చర్లపల్లి వెంకన్న, ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

ఆత్మకూర్(ఎస్) : విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని, జల్సాలకు అలవాటు పడి డ్రగ్స్, గంజాయి లాంటివి సేవించి జీవితాలను ఆగం చేసుకోవద్దని ఎస్‌ఐ సైదులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

అర్వపల్లి : మండలంలోని రామన్నగూడెం గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్ తెలిపారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులకు విన్నవించడంతో బుధవారం ఆయన గ్రామాన్ని సందర్శించి రక్షిత మంచినీటి పథకాల బోర్లను పరిశీలించారు. గ్రామం మొత్తానికి నీటిని అందించే చెలిమబావి నీరు కలుషితమయ్యాయని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వడ్డెరకాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీ, ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కొత్తగా బోర్లు వేయించి నీటి సమస్య తీర్చాలని విన్నవించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, భీముడు, ఈసీ నగేష్, కార్యదర్శి మాగి నాగయ్య, టీఏ దీపిక, ఫీల్డ్‌అసిస్టెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చీకూరి అశోక్‌కుమార్ అన్నారు. ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వసీం అక్తర్‌ఖాన్ ఈనెల 17న మృతి చెందడంతో బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నివాళులర్పించారు.

మొక్కల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

చివ్వెంల : మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకోవాలని సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) రాష్ట్ర కోఆర్డినేటర్ యానాల వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆయన ఔషధ మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో చాలా సంవత్సరాలుగా ఉన్న మర్రిచెట్టుకు 'మదర్ ట్రీ'గా నామకరణం చేశారు. యంగ్ ఎర్త్ లీడర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీజీఆర్ జిల్లా నాయకుడు మామిడి శంకర్, హెచ్‌ఎం కళారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్ ఎదురుగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 60సంవత్సరాలు ఉంటుందని, పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.